క్లుప్తంగా

'రైతునేస్తం'తో ప్రయోజనం



వీపనగండ్ల: రైతునేస్తం ప్రోగ్రాంలో భాగంగా ప్రతి మంగళవారం రైతులకు అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల ద్వారా పంటలసాగుపై ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వానాకాలం పంటలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై టెలికాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సూచనలు అందించారు.

భక్తిశ్రద్ధలతో సవారమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవారమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారికి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో స్థిరపడిన పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కోళ్లు, పోటేళ్లు, టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

'గోదాంకు 60 వేల ధాన్యం బస్తాలు చేర్చాం'



పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల నుంచి మంగళవారం వరకు 60 వేల ధాన్యం బస్తాలను గోదాంలకు చేరవేశామని లారీ ట్రాన్స్‌ఫోర్ట్ యజమాని పేర్కొన్నారు. కేంద్రాల నుంచి రోజుకు 20 వేల బస్తాలను చేరవేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో హమాలీల సంఖ్య తక్కువగా ఉండటంతో ధాన్యం బస్తాలను దించడంలో కొంత మేరకు జాప్యం జరిగిందని, ప్రస్తుం హమాలీల సంఖ్య పెంచామన్నారు. కేంద్రాల నుంచి ధాన్యం చేరవేసేందుకు మూడు టీంల హమాలీలను ఏర్పాటు చేశామన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత



మదనాపురం: మండల కేంద్రానికి చెందిన వడ్డె మహేష్ మండలంలోని వివిధ గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని మదనాపురం శివారులోని వడ్డె బాలరాజు కోళ్లఫాం వద్ద నిల్వ చేశాడు. ప్రాథమిక సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు దాడి చేసి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్ పరీక్షించి, రేషన్ బియ్యంగా నిర్ధారించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చోరీకి గురైన గన్నీ బ్యాగుల గుర్తింపు



వీపనగండ్ల: మండల కేంద్రంలోని మండల మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి కేటాయించిన మూడు గట్టాల గన్నీ బ్యాగులు వారం రోజుల క్రితం అపహరణ గురయ్యాయి. కాగా మంగళవారం కొనుగోలు కేంద్రం సమీపంలోని నీటి గుంటలో అవి దొరికినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విషయమై ఏపీఎం బిచ్చన్నను వివరణ కోరగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్నీ బ్యాగులను రైతులకు అందజేశామని, అవి అపహరణకు గురయిన విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు

- త్వరలోనే సంస్థాగత నూతన కార్యవర్గాలు
- పనిచేసే వారికే ప్రాధాన్యం
- ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



అమరచింతలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్/అమరచింత: దేశంలోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శాసన సభ్యుడు డాక్టర్ వాకిటి శ్రీహరి నాయకులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఆత్మకూర్, అమరచింత పట్టణ కేంద్రాల్లో వేరువేరుగా మండల స్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని సూచించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మండల, పట్టణ, గ్రామస్థాయి నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. పార్టీలో పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు జిల్లా అధ్యక్షుడికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గీత కార్మికవిభాగం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌చార్జ్‌లు సంజీవ్ ముదిరాజ్, సతీష్, తిరుపతయ్య, వేణుచారి, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధానకార్యదర్శి అయూబ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు గంగాధర్‌గౌడ్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, నల్గొండ శ్రీను, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, తిరుమలేష్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

కొత్తకోట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. కొత్తకోట, మదనాపురం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కొత్తగా చేరిన వారిని కలుపుకొని సీనియర్ నాయకులు పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మండల, పట్టణ నూతన అధ్యక్షులను నియమించి, పార్టీ బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ్, అబ్జర్వర్ గౌరీసతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

'గిరిజనులకు భూ పట్టాలివ్వాలి'



మాట్లాడుతున్న ఆర్. వెంకట్రాములు

ఖిల్లాఘనపురం: గిరిజనులు తరతరాల నుంచి సాగు చేస్తున్న భూములపై ప్రభుత్వం స్పందించి అర్హులకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో భూ పట్టాల సాధన కమిటీ కన్వీనర్ సక్రునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మామిడిమాడ, షాపురం గ్రామాల రెవెన్యూ శివారుల్లోని రాజుల కాలం నాటి పొలాలను గిరిజనులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆరు తరాలుగా 8 తండాలకు చెందిన గిరిజనులు సుమారు 480 ఎకరాల భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయినా వారికి మాత్రం పట్టాలు రావడం లేదని వాపోయారు. అనేక దఫాలుగా భూ పంపిణీ, సీలింగ్ చట్టాలు వచ్చినా గిరిజనులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సక్రునాయక్, బాల్యానాయక్, ఎం.అంజనేయులు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం



మాట్లాడుతున్న విజయరాములు

పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలతో కలిసి పోరాటాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ 18వ మహాసభలను జిల్లా నాయకుడు శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ నిఘా వైఫల్యంతోనే కాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రవాదుల దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కంగారు పేరుతో దేశ ఆదివాసులను హతమారుస్తున్నారని విమర్శించారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తూ రాబోయే స్థానిక ఎన్నికలల్లో సత్తా చాటాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ ఫయాజ్ అన్నారు. అంతకు ముందు నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళావతమ్మ, గోపాలకృష్ణ, సురేష్, కుతుబ్, రమేష్, కుర్మయ్య, బాలస్వామి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచేందుకే శిక్షణ



సోళీపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ



పాన్‌గల్‌లో..

పాన్‌గల్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించుటకు ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కొంత మంది ఉపాధ్యాయులకు వివిధ సబ్జెక్టులల్లో శిక్షణ ఇచ్చి వారిని మండల స్థాయిలో జరిగే శిక్షణకు మండలానికి 8 మందిని ఎమ్మార్పీలుగా నియమించినట్లు తెలిపారు.

శిక్షణ తరగతులతో ప్రయోజనం

వీపనగండ్ల: విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని మండల విద్యాధికారి నర్సింహులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. శిక్షణ తరగతుల్లో ఎఫ్‌ఎల్‌ఎన్, మూల్యాంకన, కనీస అభ్యాసన సామర్థ్యాలు, సులభంగా గణితం నేర్చుకోవడం తదితర అంశాలపై శిక్షణను పొందిన ఉపాధ్యాయులు వీటిని పాఠశాలలో అమలుపర్చి విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు నిరంజన్, స్వామి, శ్రీనివాసులు, సంతోష్, రామచంద్రయ్య, బాలగౌడ్, వనిత, రామకృష్ణ, సీఆర్పీలు వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: పాఠశాలల్లో విద్యార్థులకు తెలుగు భాష బోధించే సమయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని సోళీపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న మొత్తం 81 మంది ఉపాధ్యాయులు 100 శాతం హాజరయ్యారని తెలిపా. కార్యక్రమంలో ఆర్పీలు మహేష్, రాకేష్, అప్పా, అక్తర్, జానకీరాం, మద్దిలేటి, బాలమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జనభేరి బహిరంగ వాల్‌పోస్టర్ విడుదల

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ నెల 28న నిర్వహించే జనభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జనభేరి బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్, జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్యయాదవ్, మండల అధ్యక్షుడు ధరేంద్రసాగర్, అస్కని రమేష్, బత్తుల జీతేందర్, అంజన్న యాదవ్, రవినాయుడు, బాలచంద్రయ్య, రవిసాగర్ రాధకృష్ణ పాల్గొన్నారు.

24న జయరాములు వర్ధంతి సభ

కొత్తకోట రూరల్: ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపేందుకే అఖిలపక్ష ఐక్యవేదిక పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ అన్నారు. మంగళవారం పెద్దమందడి మండలంలో అఖిలపక్ష ఐక్యవేదిక కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణయాదవ్, ఉపాధ్యక్షులుగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా చెన్నకేశవులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌యాదవ్ మాట్లాడుతూ అవినీతి అంతం కావాలని, జిల్లాలో మట్టి, ఇసుక మాఫియా అంతం చేసేందుకు అఖిలపక్ష ఐక్యవేదిక పోరాడుతుందన్నారు. ఈనెల 24న జరిగే మాజీ ఎమ్మెల్యే జయరాముల వర్ధంతి కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గౌనికాడి యాదయ్య, పుల్లయ్య, బొడ్డుపల్లి సతీష్, సంద రామస్వామి, కురుమూర్తి, శివకుమార్, రమేష్ ఉన్నారు.

వేతన సవరణ జీవోలను గెజిట్ చేయాలి



మాట్లాడుతున్న పి.సురేష్

ఖిల్లాఘనపురం: కార్మికుల సంక్షేమం కోసం హైకోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాల మేరకు సవరించిన జీవోలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గెజిట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. మంగళవారం ఖిల్లాఘనపురం ప్రభుత్వ సామాజిక కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వం వేతనాలను సవరించి కొత్త జీవోలను తీసుకొచ్చి, వేతనాలు పెంచాల్సి ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏజెన్సీలతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు ఇవ్వాలన్నారు.కార్యక్రమంలో సాయికృష్ణ, మునేందర్, భీమయ్య, నాగయ్య, పద్మజ, ప్రియాంక పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించి దాడి చేసిన ఘటనలో కేసు నమోదు

పాన్‌గల్: కులం పేరుతో దూషించి, దాడిచేసి గాయపర్చిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పస్పుల శివమ్మ, గోర్ల అలివేలమ్మ, ఎల్లపు అలివేల, పస్పుల నరేష్, పస్పుల మహేందర్‌తో పాటు వీరి బంధువులు దాదాపుగా 26 మంది కలిసి ఇనుప కడ్డీలు, ఇటుక పెల్లలు, రాళ్లు, కట్టెలతో ఈనెల 18న అదే గ్రామానికి చెందిన వీరపాగ అనిత ఇంటి వద్దకు వెళ్లి ఆమెతో పాటు కుమారులు వీరపాగ లోకేష్, వీరపాగ సురేష్, వీరపాగ సంతోషమ్మపై దాడి చేస్తూ కులం పేరుతో దూషించారన్నారు. దాడిలో లోకేష్, సురేష్, సంతోషమ్మ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు ప్రాణ భయంతో 100 డయల్‌కు చేయగా.. దాడి చేసిన వారు పారిపోయారు. తమను కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం ప్రకారం హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మంగళవారం అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురితో పాటు వారి బంధువులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనలో..

దాడి చేసి గాయపర్చిన ఘటనలో మంగళవారం ఇద్దరిపై కేసు నమోదైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన కల్మూరి నరహరికి ఇదే గ్రామానికి చెందిన గాలిగాళ్ల వేణుకు డ్రెయినేజీ పక్కన ఉన్న బాట విషయంలో గొడవలు ఉన్నాయి. దీంతో ఈనెల 19వ తేదీన వేణు ఫోన్ చేసి డ్రెయినేజీ వద్దకు రావాలని నరహరిని పిలిచాడు. అక్కడికి వెళ్లిన నరహరిపై వేణు, అతడి బావమర్ది రవి మద్యం మత్తులో బూతులు తిడుతూ కట్టెలు, రాళ్లతో దాడి చేసి గాయపర్చారు. నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని నరహరి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం



సేంద్రియ వ్యవసాయం చేస్తున్న తోటను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

కొత్తకోట రూరల్: రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొత్తకోట మండలంలోని మిరాసిపల్లి శివారులో గల కొండారెడ్డి సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో ఎలాంటి రసాయన ఎరువులు, పిచికారీలు వాడకుండా 20 ఎకరాల్లో రైతు సాగు చేస్తున్న వంగడాలను పరిశీలించారు. ఎలాంటి ఎరువులు వాడుతారు, సేంద్రియ ఎరువుల తయారీ, వాటి వినియోగం ద్వారా వచ్చే దిగుబడి గురించి కలెక్టర్ రైతు కొండారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయ రంగంలో ఇంత సాంకేతికత, నైపుణ్యం ఎక్కడి నుంచి పొందారని రైతుతో ఆరా తీశారు. ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా సాగు చేస్తున్న మామిడి, బత్తాయి, జామ, బొప్పాయి, ఇతర అంతర్గత పంటలను పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించిన కలెక్టర్ జిల్లాలోని ఇతర పెద్ద రైతులను చూపించి సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్‌నాయక్‌కు సూచించారు. అదేవిధంగా పామాయిల్ సాగు వైపు రైతులను మళ్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి తదితరులు ఉన్నారు.

బండరావిపాకులలో విషాదం

గోపాల్‌పేట: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతిచెందిన సంఘటన రేవల్లి మండలంలోని బండరావిపాకులలో విషాదం నింపింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భారతమ్మ(55) కొంతకాలంగా హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే అయ్యప్పస్వామి దర్శనం కోసం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని పక్కింట్లో వాళ్లు శబరిమలై వెళ్తుండగా వారితోపాటు కలిసివెళ్లింది. దర్శనం అనంతరం మెట్లు దిగి వస్తుండగా మంచినీరు పట్టుకునే క్రమంలో కరెంటు వైరుకు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. భారతమ్మ భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. దేవుడి దర్శనం కోసం వెళ్లిన భారతమ్మ మృతిచెందిన వార్త తెలియడంతో స్వగ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని జూరాలకు చెందిన కుర్వ నల్లన్న ఏప్రిల్ 13న తిరుపతికి ట్రైన్‌లో వెళ్తుండగా ఫోన్ చోరీకి గురైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరులో ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చింతల హనుమాన్ ఆలయంలో పూజలు



వనపర్తిటౌన్: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాజారామేశ్వర్ రావు ట్రస్ట్ నిర్వాహకులు పట్టణంలోని చింతల హనుమాన్ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు ఆలయానికి పెయింట్ వేయించారు. 10 రోజుల నుంచి మరమ్మతు పనులు చేస్తున్నారు.

లక్ష్మి స్వరూపంలో అభయాంజనేయ స్వామి

చైత్ర పౌర్ణమి నుంచి పాల్గుణ మాసంలో వచ్చే హనుమాన్ జయంతి వరకు మాల ధరించే దీక్షాపరులు ప్రతీరోజు ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా, దండకం, భజన కీర్తనలు చేస్తారు. హనుమాన్ దీక్ష చివరి మంగళవారం కావడంతో లిల్లీ పూలు, నోట్ల కట్టలతో స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి, పంచామృత అభిషేకం చేశారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



వనపర్తి రాజీవ్‌చౌక్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేకంగా రూపొందించిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. శతాబ్ద కాలంగా కార్మిక వర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చారని మండిపడ్డారు. జూన్ 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

- వనపర్తి జిల్లా కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి, రాజీవ్‌చౌక్‌లో మానవహారం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి నక్సన్, గంధం మదన్, సునీత, నందిమల్ల రాములు, గద్దం కుర్మయ్య, చంద్రయ్య, నరేష్, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.
- అమరచింత పట్టణంలోని బస్టాండ్ రహదారిపై మంగళవారం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, రాజు, భాస్కర్, అజయ్, బి.వెంకటేష్, రాజన్న, శ్యాంసుందర్ పాల్గొన్నారు.
- పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుగ్రీవుడు, నాగన్న, తిరుపతయ్య, బాలస్వామి, లాల్య, వెంకటయ్య, మహేశ్వరి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీ కట్ట వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, వెంకటేష్ మొగిలి, చెన్నయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.
- వీపనగండ్ల మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాలగౌడ్, ఆశన్న, బాలకృష్ణాచారి, వెంకటయ్య, శ్రీనివాసులు, సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, లక్ష్మి, రాణి, నిరంజనమ్మ, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్, మోష, రాజు తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, బద్రు, జమ్ములు, నరసింహులు, వెంకటేష్, రాములు, విజయలక్ష్మి, పద్మమ్మ, నరసమ్మ, సాయిలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో..



అమరచింతలో..



మదనాపురంలో..